# వరంగల్‌లో రౌడీ రాజ్యం!

'తూర్పు'లో మాజీ రౌడీషీటర్‌దే పెత్తనం

అన్నకు ఏజ్ బార్.. అంతా నేనే చూసుకుంటా అంటూ ప్రచారం

- అడ్డూఅదుపు లేని కొండా అనుచరుడి ఆగడాలు
- మాజీ రౌడీషీటర్‌కు రోజూ సలామ్ కొడుతున్న పోలీస్!
- ఏ పదవి లేకున్నా దర్జాగా వరంగల్ కౌన్సిల్ మీటింగ్ వద్దకు..
- ఎదురేగి సెల్యూట్ కొట్టిన ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లు..!
- ఎమ్మెల్యేలతో సమానంగా పోలీసు ప్రొటోకాల్
- సీఎంకు అధికార పార్టీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ఫిర్యాదులు

వరంగల్, మే 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): వరంగల్ నగరంలో ముఖ్యంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలో రౌడీలరాజ్యం నడుస్తున్నదనే విమర్శలొస్తున్నాయి. మంత్రి కొండా సురేఖ అనుచరుడైన ఒక మాజీ రౌడీషీటర్ ఆగడాలకు అడ్డూఅదుపులేకుండా పోతున్నదని చివరకు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు సైతం ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. భూదందాలు, పంచాయితీలు, అధికారిక కార్యక్రమాలు, అధికారులకు పోస్టింగులు అన్నీ మాజీ రౌడీషీటర్ కనుసన్నల్లోనే జరుగుతున్నట్టు తెలుస్తున్నది. 'అన్నకు ఏజ్ బార్ అయ్యింది. హెల్త్ ఇబ్బంది పెడుతున్నది. అన్నీ చూసుకోవాలని నాకే చెప్పిండు. ఇప్పుడంతా నేనే. ఇక మనదే రాజ్యం' అని సదరు మాజీ రౌడీషీటర్ చెప్పుకుంటూ దందాలు సాగిస్తున్నాడనే ఆరోపణలున్నాయి. అధికారులు, ముఖ్యంగా పోలీసు అధికారులు సైతం మంత్రి సురేఖ కంటే మాజీ రౌడీషీటర్ మాటకే ఎక్కువ విలువ ఇస్తున్నారని, వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పనిచేస్తున్న పోలీసు అధికారులు పొద్దునే మంత్రి అనుచరుడిని కలిసి సెల్యూట్ చేసిన తర్వాతే డ్యూటీకి వెళ్తున్నారనే విమర్శలున్నాయి. మాజీ రౌడీషీటర్‌తో చేతులు కలిపిన కొందరు పోలీసులు సామాన్యులపై జులుం ప్రదర్శిస్తున్నారని, వ్యాపారులు, ఇతరులను బెదిరించి వారి ఆస్తులను కొల్లగొడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల మంత్రి కొండా సురేఖ పుట్టినరోజు సందర్భంగా ఆమె అనుచరుడు, వరంగల్ ఏసీపీ, ఇంతెజార్‌గంజ్, మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్లు కలిసి నడిరోడ్డుపై వేడుకలు నిర్వహించగా, పటాకులు పేలి ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటనపై ప్రజల్లో వ్యతిరేకత రావడంతో మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్యను బదిలీ చేశారు. ఇటీవల గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ మీటింగ్ జరిగే ప్రాంతానికి ఎలాంటి హోదా లేని మాజీ రౌడీషీటర్ వచ్చాడు. ఏసీపీ, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ఎదురుగా వెళ్లి సెల్యూట్ చేసి మరీ ఆయనను ఓ ప్రైవేటు రూములో కూర్చోబెట్టారు. ఈ వ్యవహారంపై అధికార పార్టీ కార్పొరేటర్లు సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

## సీఐకీ బెదిరింపులు

మాజీ రౌడీషీటర్ నవీన్‌రాజ్ డ్యూటీలో ఉన్న ఒక పోలీసు అధికారిని బెదిరించిన తీరు చర్చనీయాంశంగా మారింది. రెండురోజుల క్రితం వరంగల్‌లోని ఇస్లామియా జూనియర్ కాలేజీ మైదానంలో ఎగ్జిబిషన్ ప్రారంభ కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ వచ్చారు. మంత్రి కారు దిగి వేదిక వద్దకు వస్తున్న క్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు అక్కడికి వచ్చారు. బందోబస్తు డ్యూటీలో ఇన్‌స్పెక్టర్ సతీశ్ వారిని పక్కకు జరగాలని ఆదేశిస్తూ మంత్రిని ముందుకు తీసుకెళ్తున్నారు. అయితే, మంత్రి పక్కనే ఉన్న మాజీ రౌడీషీటర్ నవీన్‌రాజ్ కలుగజేసుకుంటూ.. 'ఎవరు నువ్వు.. నేనెవరో తెలుసా?' అంటూ ఇన్‌స్పెక్టర్ సతీశ్‌ను బెదిరించడం, ఇన్‌స్పెక్టర్ సైతం అదే స్థాయిలో 'నేనెవరో తెలుసా?' అంటూ బదులిచ్చారు. ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. వరంగల్‌లో రౌడీలు పెత్తనం చెలాయిస్తున్నారని, పోలీసులు వారికే సహకరిస్తున్నారని అధికార పార్టీ ఎమ్మెల్యేలు సైతం సీఎంకు ఇప్పటికే ఫిర్యాదు చేశారు. 'నగరంలో ఇప్పుడున్న ఈ పరిణామాలు మా 30 ఏండ్ల రాజకీయం ఎప్పుడూ చూడలేదు. ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటే ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకముంటుందని' ఒక ఎమ్మెల్సీ, ఒక ఎమ్మెల్యే సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

# గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు మాకొద్దు

- దాని వల్ల మాకేం లాభం
- ముందస్తు సమాచారం లేకుండా గ్రామ సభలెందుకు?
- అధికారులపై గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు భూబాధితుల ఆగ్రహం
- రావిర్యాలలో గ్రామ సభ బహిష్కరణ
- టైటిల్ డీడ్ ఉన్న రైతులకే నష్టపరిహారం చెల్లిస్తాం
- రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ వెల్లడి

ఆదిబట్ల, మే 7: 'గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు మాకొద్దు. దానివల్ల మాకేం లాభం లేదు. అంతా ఉన్నోళ్లకు లాభం. మా భూములు పోవడం తప్ప మాకెందుకు ఉపయోగపడదు' అని రేడియల్ రోడ్డు భూబాధితులు అధికారులను నిలదీశారు. ముందస్తు సమాచారం లేకుండా గ్రామ సభను నిర్వహించడంపై మండిపడ్డారు. బుధవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని రావిర్యాల గ్రామంలో కొంగరఖుర్ద్ రెవెన్యూలో గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు ఏర్పాటులో భూములు కోల్పోతున్న రైతులతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భూసేకరణ అధికారి రాజు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా భూములు కోల్పోతున్న రైతులు అధికారులను నిలదీశారు. 'బతుకుదెరువు పోయి మేము రోడ్డున పడుతుంటే పోలీసుల అండతో మమ్మల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేసి భూములు గుంజుకొంటారా?' అని ప్రశ్నించారు. రేడియల్ రోడ్డులో ఎన్ని ఎకరాలు పోతున్నాయి? ఎకరాకు ఎంత నష్టపరిహారం ఇస్తారో తమకు సమాచారం లేదని అన్నారు. రాత్రి అందరు నిద్రపోయిన తరువాత చాటింపు వేయించి తెల్లవారే సరికి ఎవ్వరికి సమాచారం లేకుండానే గ్రామసభలు నిర్వహించడం ఏంటని భూసేకరణ అధికారిని నిలదీశారు. ఒకే సర్వే నంబర్‌లో రెండుసార్లు ప్రభుత్వం భూమిని సేకరించడం ఏంటని మండిపడ్డారు. భూముల వద్ద పోలీసులు పహారా కాసి తమను రానియ్యడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులకు సమాధానం చెప్పలేక భూసేకరణ అధికారి రాజు అయోమయానికి గురయ్యాడు. దాదాపు 30మంది రైతులు గ్రామ సభను బహిష్కరిస్తూ తీర్మానం చేసిన కాపీని భూ సేకరణ అధికారికి అందచేసి అక్కడ నుంచి వెళ్లిపోయారు. దీంతో అక్కడ ఉన్న కొంతమందితో సభను కొనసాగించారు.

### టైటిల్ డీడ్ ఉంటేనే పరిహారం

గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు ఏర్పాటులో భూములు కోల్పోతున్న రైతులకు టైటిల్ డీడ్ ఉంటే పరిహారం అందుతుందని, కబ్జాలో ఉంటే రాదని రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. గ్రామ సభలో మాట్లాడుతూ.. రోడ్డు ఏర్పాటులో వంద శాతం భూమి కోల్పోతే దానిపైనే ఆధారపడి జీవిస్తున్న రైతుల కుటుంబంలోని 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.5.5 లక్షలు ఇవ్వడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని అన్నారు. భూములకు ఎంత ధర చెల్లించాలో ప్రభుత్వం త్వరలోనే నిర్ణయిస్తుందని చెప్పారు. ఇప్పటికే 42మంది రైతులకు చెందిన 54 ఎకరాల 33 గుంటల భూమిని సేకరించడం జరిగిందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

# సందిగ్ధంలో అందాల పోటీలు!

- 'ఆపరేషన్ సిందూర్‌తో కమ్ముకున్న యుద్ధ మేఘాలు
- భారత్-పాక్ ఉద్రిక్తతల వల్ల 200 విమాన సర్వీస్‌లు రద్దు
- ఇప్పటి వరకు 88 దేశాల భామలే వచ్చినట్టు అంచనా
- మిగతావారి రాకపై అనుమానాలు
- షెడ్యూల్ మార్పా? కొనసాగింపా? మిస్ వరల్డ్ సంస్థ తర్జన భర్జన
- భవిష్యత్ కార్యాచరణపై సంస్థ నేడు ప్రకటించే అవకాశం



**అందాల పోటీలకు వ్యతిరేకంగా మహిళల నిరసన**

కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన అందాల పోటీలకు వ్యతిరేకంగా నిజామాబాద్‌లో ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం కండ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. పెట్టుబడిదారులకు ఆదాయం తెచ్చే అందాల పోటీలు నిర్వహించడం మానుకోవాలని సూచించారు. – కంఠేశ్వర్

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ) : భారత్– పాకిస్థాన్ నడుమ ఉద్రిక్త పరిస్థితుల కారణంగా రాష్ట్రంలో నిర్వహించ తలపెట్టిన మిస్ వరల్డ్ పోటీలపై సందిగ్ధత నెలకొన్నది. ఈ నెల 10 నుంచి 31 వరకు హైదరాబాద్‌లో జరగాల్సిన మిస్ వరల్డ్ పోటీల షెడ్యూల్‌ను నిర్వాహకులు మార్చే యోచనలో ఉన్నట్టు తెలుస్తున్నది. పోటీలో పాల్గొనే అందాల భామల భద్రత విషయంలో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉన్నదన్న అనుమానాల నేపథ్యంలో పోటీల నిర్వహణపై తర్జనభర్జన పడుతున్నట్టు తెలుస్తున్నది. ఇప్పటికే 70శాతం మంది పోటీదారులు హైదరాబాద్‌కు చేరుకున్న నేపథ్యంలో పోటీలను కొనసాగించడమా? లేక షెడ్యూల్‌ను మార్పు చేయడమా? అనే అంశం మీద మిస్ వరల్డ్ సంస్థ ప్రతినిధులు మల్లగుల్లాలు పడుతున్నట్టు సమాచారం. దీనిపై గురువారం సాయంత్రానికి అధికారిక ప్రకటన విడుదలయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది.

### ఇంకా రావాల్సింది 28 దేశాల వారు

హైదరాబాద్‌లో జరిగే 72వ 'మిస్ వరల్డ్–2025' పోటీలకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు.116 దేశాల భామలు పోటీల్లో పాల్గొంటారని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. బుధవారం సాయంత్రానికి 88 దేశాల పోటీదారులు హైదరాబాద్ చేరుకున్నట్టు తెలిసింది. మరో 28 దేశాల వారు రావాల్సి ఉన్నది. పాకిస్థాన్ ఉగ్రవాదులను మట్టుబెట్టేందుకు భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను మొదలు పెట్టడంతో ఇరు దేశాల మధ్య యుద్ధ వాతావరణం ఏర్పడింది. ఈ క్రమంలో దేశంలోని 18 ఎయిర్‌పోర్టులను భారత ప్రభుత్వం తాత్కాలికంగా మూసివేసింది. దేశంలో దాదాపు 200 విమాన సర్వీస్‌లు రద్దయినట్టు అధికారులు ప్రకటించారు. ఈ క్రమంలోనే మిస్ వరల్డ్ పోటీలు డైలమాలో పడ్డాయి. పేరు నమోదు చేసుకున్నవారు అందరూ రాకుండా పోటీలు నిర్వహిస్తే న్యాయపరమైన సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉన్నదని మిస్ వరల్డ్ సంస్థ ప్రతినిధులు ఆలోచిస్తున్నట్టు తెలిసింది. మరోవైపు భద్రతాపరమైన ఇబ్బందులు కూడా తలెత్తే అవకాశం ఉన్నదని, పోటీదారులతో పాటు, ఈవెంట్ కవరేజ్ కోసం వచ్చిన విదేశీ మీడియా ప్రతినిధులకు రక్షణ కల్పించటం కష్టతరంగా మారవచ్చని ఆందోళనతో ఉన్నట్టు సమాచారం. దీంతో సంస్థ ప్రతినిధులు, ప్రభుత్వ ప్రతినిధులతో గురువారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిసింది. ఈ సమావేశం అనంతరం తదుపరి కార్యాచరణ ప్రకటించే అవకాశం ఉన్నది.

## ఎమ్మెల్యే కడియం అనుచరుల భూదందా!?

- క్రయవిక్రయాల్లో జోక్యం!
- అధికారులపై ఒత్తిడి తెస్తున్న శ్రీహరి పీఏ రాకేశ్?

జనగామ, మే 7(నమస్తే తెలంగాణ) : అధికార కాంగ్రెస్ పార్టీని అడ్డం పెట్టుకొని స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి అనుచరుల ఆగడాలు రోజురోజుకూ మితిమీరుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కడ భూక్రయవిక్రయాలు జరిగినా కాంగ్రెస్ నాయకులు జోక్యం చేసుకొని తాము ఎమ్మెల్యేకు ముఖ్య అనుచరులమంటూ అటు భూములు అమ్మిన వారిని.. ఇటు కొనుగోలు చేసిన వారిని బెదిరిస్తూ అందినకాడికి డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మాట వినకుండా స్లాట్ బుక్ చేసుకుంటే ఎమ్మెల్యే పీఏ రాకేశ్ ద్వారా తహసీల్దార్లపై ఒత్తిడి తెచ్చి రిజిస్ట్రేషన్లు అడ్డుకోవడం, లేదంటే అమ్మకం, కొనుగోలుకు సంబంధించిన దాయాదులను (అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లను) ఉసిగొల్పి పోలీస్‌స్టేషన్లలో కేసులు పెట్టించి భయాందోళనకు గురిచేస్తున్నట్టు సమాచారం. ఇవేకాకుండా నియోజకవర్గ పరిధిలోని అటు వరంగల్ హైవేలో రఘునాథపల్లి నుంచి చిల్పూరు వరకు.. ఇటు సూర్యాపేట హైవేలో నెల్లుట్ల నుంచి లింగాలఘనపురం, వడిచర్ల వరకు ఎలాంటి భూములు అమ్మినా, కొనుగోలు చేసినా ఆయా పరిధిలోని కాంగ్రెస్ నాయకులు జోక్యం చేసుకుంటున్నట్టు తెలుస్తున్నది. ఎమ్మెల్యే అనుచరులమంటూ అటు అమ్మకందారులు, ఇటు కొనుగోలుదారుల నుంచి డబ్బులు డిమాండ్ చేయడం పనిగా పెట్టుకొన్నారన్న వాదనలు విన్పిస్తున్నాయి. వెంకటాద్రిపేటకు చెందిన ఓ రైతు 2.12 ఎకరాలను విక్రయించే క్రమంలోనూ ఓ కాంగ్రెస్ నాయకుడు జోక్యం చేసుకున్నట్టు తెలిసింది. ఇందులో తనకు 20 గుంటల భూమి ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు సమాచారం. చుట్టుపక్కల ఏ గ్రామంలోనైనా భూముల క్రయవిక్రయాలు జరిగితే సదరు నాయకుడు జోక్యం చేసుకొని శ్రీహరి పీఏ రాకేశ్‌తో ఫోన్ చేయించి పనులు ఆపాలని ఒత్తిడి చేయిస్తున్నట్టు తెలుస్తున్నది.

### కడియం పీఏ రాకేశ్ దందాలు!

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఓ పక్క ఎమ్మెల్యే కడియం అనుచరులపై భూదందా ఆరోపణలు వస్తుండగా.. మరో పక్క ఆయన పీఏ రాకేశ్ అక్రమాలు, బెదిరింపులు, ప్రభుత్వ అధికారులపై తెస్తున్న ఒత్తిడిపై కూడా పలు విమర్శలు వస్తున్నాయి. అక్రమ వసూళ్ల పేరుతో నియోజకవర్గ ప్రజలను రాకేశ్ పీడించడం సహా ఎవరైనా భూమి రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఎకరానికి కొంత చొప్పున ఇవ్వాలని ఎమ్మెల్యే పేరు చెప్పి బెదిరిస్తున్నట్టు సమాచారం. సొంత బాబాయికి భూమి అమ్మాలనుకున్న ఓ ఎన్నారై మహిళను వేధిస్తూ ఐదు నెలలుగా తహసీల్దార్‌పై ఒత్తిడి తెచ్చి రిజిస్ట్రేషన్ చేయకుండా ఆపినట్టు తెలిసింది. సదరు వ్యవహారంలో తనకు 10గుంటలు రాసివ్వాలని లేకపోతే భూమి రిజిస్ట్రేషన్ ఆపేస్తానని పీఏ రాకేశ్ సదరు మహిళను, భూమి కొనుగోలు చేసే వ్యక్తిని బెదిరించినట్టు సమాచారం.

### • రైతాంగాన్ని నిలువు దోపిడీ చేస్తున్న కాంగ్రెస్



రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని నిలువు దోపిడీ చేస్తున్నదని, పండించిన ప్రతి పంటకూ కమీషన్ తీసుకుంటూ.. దీన్నే ఆదాయ మార్గంగా ఎంచుకొందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం హనుమకొండలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లలో రూ.1100 కోట్లు... సీసీఐ పత్తి కొనుగోళ్లలో రూ. 3000 కోట్లు కుంభకోణం జరిగిందని ఆరోపించారు. అకాల వర్షాలతో ధాన్యం తడిచి నష్టాల్లో కూరుకుపోయిన రైతులను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. టార్పాలిన్లు, మాయిశ్చర్ మిషన్ల కోసం రైతులు కొట్టుకుంటున్నారని తెలిపారు. రైతుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించే వరకు బీఆర్‌ఎస్ నాయకులు రైతుల తరపున పోరాటం చేస్తారని పేర్కొన్నారు. –హనుమకొండ

### • గన్నీ సంచుల కోసం ఎగబడ్డ రైతులు



నిర్మల్ జిల్లాలో నాలుగు రోజులుగా గన్నీ సంచుల కొరత రైతులను తీవ్రంగా వేధిస్తున్నది. దస్తురాబాద్ మండలం రేవోజిపేటకు బుధవారం గన్నీ సంచులు రాగా రైతులు ఒక్కసారిగా ఎగబడ్డారు. రేవోజీపేటలో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ కొనుగోలు కేంద్రానికి 10 వేలు, గొడిసెర్యాల గొండుగూడెం(జీ)కి 8వేల గన్నీ సంచులు వచ్చినట్టు పీఏసీఎస్ చైర్పర్సన్ రామడుగు శైలజారమేశ్‌రావు తెలిపారు. –దస్తురాబాద్

### • తడిసిన ధాన్యం కొనాలి



తడిసిన ధాన్యం కొనాలని జగిత్యాల నియోజకవర్గ రైతులు రోడ్డెక్కారు. మంగళవారం అర్ధరాత్రి కురిసిన అకాలవర్షానికి ధాన్యం తడవగా, బుధవారం జగిత్యాల జిల్లాకేంద్రంలోని చల్‌గల్ వ్యవసాయ మార్కెట్ ఎదుట జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి జాతీయ రహదారిపై రైతులు ఆందోళన చేశారు. అదనపు కలెక్టర్ బీఎస్ లత తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. –జగిత్యాల

## రెండ్రోజులు వడగండ్ల వానలు

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): చక్రవాత ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా మరో రెండ్రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వానలు కురిసే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణశాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. గురువారం నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. గడిచిన 24 గంటల్లో కామారెడ్డి జిల్లా తాడ్వాయిలో 3.24 సెం.మీ, ఖమ్మం జిల్లా ఖమ్మం గ్రామీణంలో 2.85 సెం.మీ, రాజన్న –సిరిసిల్ల జిల్లా వీరన్నపల్లెలో 2.85 సెం. మీ, మంచిర్యాల జిల్లా తాండూరులో 2.81 సెం.మీ, సూర్యాపేట జిల్లా మల్లెచెర్వులో 2.70 సెం.మీ, సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో 2.44 సెంటిమీటర్ల వర్షపాతం నమోదైనట్టు వెల్లడించింది.

### • వడ్లు మిల్లుకు ఎందుకు తరలించరు?



ధాన్యం కాంటాలైనా తన బస్తాలను ఎందుకు తరలించరని ఓ రైతు బుధవారం పెట్రోల్ బాటిల్‌తో మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర ధాన్యం కొనుగోలు కేంద్రంలో హల్‌చల్ చేశాడు. సోమ్లా తండాకు చెందిన బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. తనకన్నా వెనుక కాంటాలైన రైతుల బస్తాలను లారీల్లో తరలించి తన బస్తాలను ఆపారని ఆరోపించారు. దీనిపై నిలదీస్తే దొడ్డు ధాన్యాన్ని మాత్రమే లారీ యాజమాన్యాలు, AZమిల్లు వాళ్లు తీసుకెళ్తున్నారని సమాధానం చెప్పారని తెలిపారు. ధాన్యాన్ని తీసుకెళ్లకపోవడంతో మనస్తాపం చెంది పెట్రోల్ బాటిల్ తీసుకొచ్చినట్టు తెలిపారు. సన్న ధాన్యాన్ని తీసుకెళ్లడంలో జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. పోలీసులు చేరుకొని రైతును సముదాయించి రేపు ధాన్యం బస్తాలను తరలించేలా లారీలను పంపిస్తామని చెప్పడంతో రైతు ఆందోళన విరమించాడు. –పెద్దవంగర

# సర్కారు ధిక్కరణ.. హైకోర్టు సీరియస్

› మొదటిపేజీ తరువాయి...

నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు కోసం అసైన్డ్, పట్టా భూములను ప్రభుత్వం సేకరించింది. నెల రోజుల క్రితం మండలంలో ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులు పోలీసుల బందోబస్తు నడుమ సర్వే చేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. దీంతో రైతులు, వ్యవసాయ కూలీలు హైకోర్టును ఆశ్రయించారు. భూములను సర్వే చేసి, ఫెన్సింగ్ వేసి ఆ భూముల్లోకి రాకుండా తమను అడ్డుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలను దెబ్బతీశారని మండలంలోని మేడిపల్లి నానక్‌నగర్ గ్రామాలకు చెందిన సంద వజ్రమ్మ, నల్లొల్ల యాదమ్మ, కానమోని అచ్చమ్మ, మొరుగు జ్యోతి, గోల్కొండ హంసమ్మ, అందోజు విమలమ్మ, అందోజు మౌనిక, అందోజు వజ్రమ్మ తదితరులు ఆరోపించారు. భూసేకరణ చట్టం ప్రకారం భూములు సేకరించి, స్వాధీనం చేసుకుంటే కూలీలకు పునరావాసం కింద ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉండగా, అధికారులు దానిని ధిక్కరించి తమ ఉపాధిపై దెబ్బ కొట్టారని వాదించారు. మేడిపల్లి, నానక్‌నగర్ గ్రామాలకు సంబంధించి మొత్తం భూములపై స్టే ఉందని అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికి వారు పట్టించుకోవడంలేదని వాపోయారు. అడ్డుకునేందుకు వెళ్లిన తమపై దౌర్జన్యం చేశారని, అరెస్టు చేసి, కేసులు పెడుతామని పోలీసులు, అధికారులు బెదిరించినట్టు కోర్టుకు వివరించారు.



### నాలుగు వారాల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం

బాధిత రైతులు, కూలీల వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వినోద్‌కుమార్.. అధికారులు తప్పుడు చర్యలకు పాల్పడినట్టు నిర్ధారించారు. ఐఎఫ్‌ఎస్ వైస్ చైర్మన్, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, యాచారం తహసీల్దార్ అయ్యప్పలకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. వీరంతా స్వయంగా కోర్టుకు వచ్చి కానీ, లేదంటే న్యాయవాది ద్వారా కానీ నాలుగు వారాల్లో వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది.

### హర్షం వ్యక్తంచేసిన రైతులు, కూలీలు

హైకోర్టు ఆదేశాలపై రైతులు, కూలీలు హర్షం వ్యక్తంచేశారు. యాచారం మండలంలోని ఫార్మా బాధిత గ్రామాల్లోని రైతులు ప్రభుత్వంపై తొలిసారి విజయం సాధించడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకెళ్తామని తెలిపారు.

### అక్రమంగా వేసిన ఫెన్సింగ్‌ను అధికారులతోనే తీయిస్తాం: కవుల సరస్వతి

అధికారులు దౌర్జన్యంగా వేసిన కంచెను వారితోనే తీయిస్తామని ఫార్మా వ్యతిరేక పోరాట సమితి సమన్వయకర్త కవుల సరస్వతి తెలిపారు. కోర్టు స్టే ఉన్నప్పటికీ, రైతులను బెదిరించి ఫెన్సింగ్ వేయడం సరికాదని పేర్కొన్నారు. భూసేకరణ చట్టం ప్రకారం అన్ని రకాల ప్యాకేజీలు, పునరావాసం, ఉపాధి కల్పించే వరకు పోరాడతామని స్పష్టంచేశారు.

## 'పాలమూరు'కు అనుమతివ్వండి

### సీడబ్ల్యూసీ చైర్మన్‌కు మంత్రి ఉత్తమ్ విజ్ఞప్తి

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌కు అనుమతులు మంజూరు చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర జల సంఘాన్ని (సీడబ్ల్యూసీ) కోరారు. బుధవారం ఆయన ఢిల్లీలో సీడబ్ల్యూసీ చైర్మన్ అతుల్ జైన్‌ను కలిసి, రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టులపై చర్చించారు. పాలమూరు–రంగారెడ్డి లిఫ్ట్ స్కీంతోపాటు సమ్మక్కసాగర్ బరాజ్ అనుమతులు మంజూరు చేయాలని, నీటి కేటాయింపులు పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై అధ్యయనం చేయించడంతోపాటు ముంపు నుంచి తెలంగాణకు రక్షణ కల్పించాలని విన్నవించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇటీవల నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ఇచ్చిన నివేదికను సీడబ్ల్యూసీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆ నివేదికలోని అంశాలపై ముందుకెళ్లే ప్రక్రియను సీడబ్ల్యూసీ పర్యవేక్షించాలని, సాంకేతిక సలహాలు ఇవ్వాలని, ఎన్‌డీఎస్‌ఏ నిర్దేశించిన పునరుద్ధరణ అంశాలపై సలహా ఇవ్వాలని కోరారు.

### • ఇందిరమ్మ ఇండ్లపై నిలదీత



ములుగు జిల్లా వాజేడు మండలంలో బుధవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు అందజేశారు. ఈ క్రమంలో కొందరు మహిళలు ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తమపేర్లు రాలేదని, కొందరికే ఎలా ఇస్తారని మంత్రిని నిలదీశారు. మరో విడతలో అందరికీ ఇచ్చేలా చూస్తానని మంత్రి సముదాయించే ప్రయత్నం చేశారు. –వాజేడు

# నీటి వాటాల పంపిణీ అధికారం బోర్డుకు లేదు

- సుప్రీంకోర్టుకు తెలిపిన తెలంగాణ
- విచారణ జూలై 28కి వాయిదా

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): స్థాపిత సామర్థ్యం మేరకు జల విద్యుత్తును ఉత్పత్తి చేయాలని నిర్ణయిస్తూ తెలంగాణ సర్కారు జారీచేసిన జీవో34పై ఏపీ, రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతలను బోర్డులకు అప్పగిస్తూ కేంద్రం జారీచేసిన గెజిట్‌పై తెలంగాణ దాఖలు చేసిన రిట్ పిటిషన్లపై బుధవారం సుప్రీంకోర్టులో వాదనలు కొనసాగాయి. దీంతో రాష్ట్రాల మధ్య నదీ జలాలను పంపిణీ చేసే అధికారం రివర్ బోర్డులకు లేదని తెలంగాణ మరోసారి స్పష్టం చేసింది. ట్రిబ్యునల్ పంపిణీ చేసిన వాటాలను పర్యవేక్షించే బాధ్యత మాత్రమే బోర్డులకు ఉంటుందని వివరించింది. నీటి వాటాలు తేలేవరకూ ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించలేమని తేల్చిచెప్పింది. నీటి పంపిణీ లేనందునే సుదీర్ఘకాలంగా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని, ఈ నేపథ్యంలోనే నదీ జలాల పునఃపంపిణీకి కేంద్రం సెక్షన్ 3 మార్గ దర్శకాలను జారీ చేసిందని గుర్తుచేసింది. ఆ మేరకు ట్రిబ్యునల్ ఎదుట వాదనలు కొనసాగుతున్నాయని తెలిపింది. దీంతో తదుపరి విచారణను జూలై 28కి వాయిదా వేస్తున్నట్టు సుప్రీంకోర్టు ప్రకటించింది.

# ఎన్నికల హామీలను అమలు చేయాలి

### సార్వత్రిక సమ్మె పోస్టర్ విడుదల చేసిన ఎస్‌కేఎం నాయకులు

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం సమగ్ర రుణమాఫీ చేయాలని, ఆరు పంటలకు బోనస్ ఇవ్వాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) డిమాండ్ చేసింది. బుధవారం మార్క్స్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎస్‌కేఎం కన్వీనర్లు టీ సాగర్, వీ ప్రభాకర్, ఉపేందర్‌రెడ్డి, ప్రసాదన్న, విజయ్‌లు ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్ కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని రూపొందించడంతోపాటు, రైతు భరోసాను అర్హులైన రైతులందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2011చట్టం ప్రకారం కౌలు రైతులకు రుణార్హత కార్డులు ఇవ్వాలని కోరారు. అకాల వర్షాలు, వడగండ్ల వానల వల్ల నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలని పేర్కొన్నారు. కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్ల రద్దు కోసం ఈనెల 20న నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.